## మానవహక్కుల ఉల్లంఘన

శ్రీకాకుళం ఎస్పీ శ్రీకాంత్ విషయంలో డీఐజీ సౌమ్యమిశ్రా ప్రదర్శించిన దురుసు వైఖరి.. కులదూషణే కాకుండా మానవ హక్కుల ఉల్లంఘన అని ఎస్సీ, ఎస్టీ అధికారుల సామాజిక న్యాయవేదిక స్పష్టం చేసింది. సనాతన హైందవ సంప్రదాయ కుటుంబంలో జన్మించిన సౌమ్యమిశ్రా, తన తోటి ఐపీఎస్ అధికారి శ్రీకాంత్‌ను జిల్లా ఎస్పీ అనీ చూడకుండా బహిరంగంగా కించపర్చడం.. కుల దురహంకారం కాక మరేమిటని న్యాయవేదిక ప్రశ్నించింది. శ్రీకాంత్‌ను ఊరడించేందుకు న్యాయవేదిక కోర్ కమిటీ ఆదివారం సమావేశమైందని అధికార ప్రతినిధి అంబేద్కర్ తెలిపారు. ‘గెట్ అవుట్*, షటప్*, గో అండ్ స్టాండ్ ఔట్‌సైడ్* లాంటి పదాలను ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే కింది స్థాయి అధికారులపై సైతం ఎవరూ వాడడం లేదని, అలాంటిది సబార్డినేట్ ఆఫీసర్ల ముందు శ్రీకాంత్‌ను ఆ విధంగా సౌమ్యామిశ్రా దూషించడం పరిశీలిస్తే న్యాయం దొరకుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు.

## సర్వప్రాణులపై ప్రేమ కలిగి ఉండాలి

ఖమ్మం: సర్వప్రాణులపై ప్రేమను కలిగి ఉంటే దేవునిపై భక్తి కలిగి ఉన్నట్లేనని ఖమ్మం శ్రీషిర్డీ సాయిబాబా సేవాశ్రమం అధ్యక్షుడు సాయి గురుదేవ విజయకుమార్ ఉద్బోధించారు. స్థానిక కెఎన్ఎస్ కాంప్లెక్స్‌లో సాయి సేవక్ వై.రాజారావు ఆధ్వర్యంలో జరిగిన షిర్డీ సాయిబాబా ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా ఆయన ప్రసంగించారు. మనపై భగవంతుడికి ప్రేమ ఉంటే ద్వేషాలు అన్ని తొలుగుతాయని, మానవులు తాము చేసే తప్పులను గమనించకపోవడమే అన్ని దురాగతాలకు మూల కారణమన్నారు. భగవంతునిపై విశ్వాసం లేకుంటే ఆరాధన చేసే అర్హత లేదని ఉపదేశమిచ్చారు. ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. సామూహిక సాయి సత్యవ్రతాలు, సాయి సేవక్‌లతో సత్సంగ ప్రసంగాలు, భక్తి గీతాలు ఆలపించారు. సేవాశ్రమం ఆధ్యాత్మిక కల్చరల్ ట్రస్టు వారిచే సాయిబాబా జీవిత చరిత్ర దృశ్యగాన రూపకము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ఉపాధ్యక్షురాలు ధనలక్ష్మి, సాయి సేవక్ శివానందర్, తదితరులు పాల్గొన్నారు.

## డాట్‌కాం వెబ్‌సైట్‌ను ప్రారంభించిన జయసుధ



హైదరాబాద్ .. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు, అనాథలను ఆదరించేందుకు మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ప్రముఖ సినీనటి జయసుధ పేర్కొన్నారు. చందానగర్‌లోని క్రైస్ట్ చిల్డ్రన్ మినిస్ట్రీస్ నాలుగవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆ సంస్థ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. సీసీఎం రోజీ డాట్‌కామ్ పేరుతో నెలకొల్పిన వెబ్‌సైట్‌ను జయసుధ ప్రారంభించారు.

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ సందర్భంగా ఆసంస్థ చేస్తున్న పలు సేవాకార్యక్రమాలకు సంబంధించిన సీడీని కూడా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శారద విద్యానికేతన్ ఉపాధ్యాయులు ప్రభావతి, విజయలక్ష్మి, భాగ్యలక్ష్మి, పుష్ప, ఉషా, మినిస్ట్రీస్‌కు చెందిన చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## నేర చరితులపై నిరంతర నిఘా

క్రిష్ణా: సబ్ డివిజన్‌లో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని అవనిగడ్డ నూతన డీఎస్పీ ఎం యాదయ్య పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా నాగకర్నూల్ నుంచి బదిలీపై వచ్చిన ఆయన ఆదివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలను పురస్కరించుకుని దివిసీమలోని రౌడీషీటర్లు, నేరచరిత్ర ఉన్న వ్యక్తులు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయడంతోపాటు నిరంతర నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో పటిష్ట పోలీసు బందోబస్తు చేపడతామని చెప్పారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల్లో రాజకీయ నేతలు, ప్రజలు సమన్వయంతో వ్యవహరించాలని కోరారు. ఘర్షణలు, అల్లర్లకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు కీలక రికార్డులను ఆయన పరిశీలించారు. బాధ్యతల స్వీకారం కార్యక్రమంలో సీఐ సూర్యచంద్రరావు, ఎస్ఐలు సత్యకిషోర్(అవనిగడ్డ), రాఘవయ్య(కోడూరు), మూర్తి (నాగాయలంక) పాల్గొన్నారు.

## క్యాన్సర్ నిర్మూలన సామాజిక బాధ్యత: కమలహాసన్

హైదరాబాద్ .. దృఢసంకల్పం, ఆత్మవిశ్వాసంతో క్యానర్‌లాంటి ప్రాణాంతక వ్యాధులను ఎదుర్కోవాలని ప్రముఖ నటుడు కమల హాసన్ అన్నారు. గ్రాండ్ కాకతీయ హోటల్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్యాన్సర్ నిర్మూలన సామాజిక బాధ్యతని అన్నారు. గత కొంతకాలంగా బ్రెస్ట్ క్యానర్‌తో బాధపడుతున్న నటి గౌతమిని ప్రత్యక్షంగా చూస్తున్నానని, వ్యాధి గుర్తించిన రోజు నుంచి ఇప్పటి వరకు ఆమె ఎంతో ధైర్యం గా బ్రెస్ట్ క్యాన్సర్‌ను ఎదుర్కొంటున్న అనుభవాలను చిత్రీకరించినట్లు తెలిపారు. నటి గౌతమి మాట్లాడుతూ.. బ్రెస్ట్ క్యాన్సర్ ను ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారణ సులభమన్నారు. బ్రెస్ట్‌క్యాన్సర్‌తో బాధపడుతున్న ప్రముఖ దర్శకుడు, నిర్మాత యష్‌చోప్రా సతీమణి, నేపథ్యగాయని పమేలా చోప్రా, గౌతమిలను సన్మానించారు.



ప్రముఖ సీనియర్ పాత్రికేయులు, వినియోగదారుల ఉద్యమ నాయకుడు కొత్తూరు. సత్యనారాయణ గుప్త సారథ్యంలో వినియోగదారుల వేదిక న్యూస్ లెటర్‌ను ప్రారంభించడం జరిగింది. ఈ వేదిక ద్వారా ప్రపంచంలోని తెలుగు వారిలో వినియోగదారుల ఉద్యమాన్ని తీసుకుని వచ్చేందుకు చేస్తున్న ఓ చిరు ప్రయత్నం. రాష్ట్రంలోని ప్రతి వినియోగదారుల సంఘాల నాయకులు వారి రచనలు ఈ క్రింది చిరునామాకు పంపగలరు.

**వినియోగదారుల వేదిక**

44-86-4,ప్రకాష్‌నగర్,కర్నూలు.. 4(ఏపి)ఇండియా. సెల్ నెంబర్ 91 9440228999

E Mail.. **consumer.guide@yahoo.in**

# ఓటు హక్కు వినియోగించుకోండి.. కలెక్టర్

అనంతపురం.. నేటి సమాజంలో అర్హులైన వారందరూ తప్పక తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని, అప్పుడే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని జిల్లా కలెక్టర్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. అర్హులైన వారందరూ తప్పక ఓటరుగా నమోదయి కింద తెలిపిన నియమాలను పాటిస్తూ రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన ఓటుహక్కును సద్వినియోగపరచుకొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని సూచిస్తూ... నియమాలను తప్పక పాటించాలని పిలుపునిచ్చారు.

* 2009వ సంవత్సరం జనవరి ఒకటి నాటికి 18 సంవత్సరాల వయసు పూర్తయి ఓటరుగా నమోదు కానీ వారు ఫారం-6ను పూర్తిచేసి బూత్ లెవల్ కేంద్రం లేక స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మీపేరు నమోదు చేసుకోవాలి. ఈ అవకాశం నామినేషన్లు దాఖలుచేయు చివరి రోజు వరకు ఉంటుంది.* మీరు ఓటరుగా నమోదు అయి ఫోటో గుర్తింపుకార్డు పొందకపోతే వెంటనే బూత్ లెవల్ కేంద్రంలో లేక తహసీల్దార్ కార్యాలయంలో పొందవచ్చు.
* బూత్ లెవల్ కేంద్రంలోనూ లేక తహసీల్దార్ కార్యాలయంలోనూ పోటో గుర్తింపు కార్డు పొందినపుడు ఫోటో గుర్తింపు కార్డులో మీ వివరాలు సక్రమంగా ముద్రింపబడినది లేనిది సరి చూసుకోవాలి.
* ఫోటో గుర్తింపు కార్డులో మీ వివరములు పొరపాట్లు లేక తప్పులు ఉన్నచో సరైన సమాచారం సంబంధిత కేంద్ర ఇన్‌ఛార్జ్‌కు తెలపాలి.* బూత్‌లెవల్ కేంద్రం/ తహసీల్దార్ కార్యాలయంలో సవరించిన కార్డులను పొందాలన్నారు.
* ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం ద్వారా ఎలా ఓటు వేయాలి అనే అవగాహన కార్యక్రమానికి మీ సమీప కేంద్రం వద్ద హాజరు కావాలి. ఏప్రిల్ నెల 23వతేదీ ఉదయం 7.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు జరుగు లోక్‌సభ, శాసనసభ ఎన్నికల పోలింగ్‌లో ఓటుహక్కు వినియోగానికి ఎపిక్ కార్డుతో వెళ్లవచ్చును.
* రాజకీయ పార్టీలు ఏర్పాటుచేసిన వాహన సౌకర్యాన్ని ఓటింగ్ వెళ్లుటకు వినియోగించరాదు.
* ఎలాంటి ప్రలోభాలకు మీ ఓటు దుర్వినియోగపరచరాదు.
* ధైర్యంగా మీ ఓటు హక్కును ఎవరికి తెలుపక సద్వినియో పరచుకోండి
* మీ వంతు వచ్చు వరకు క్యూ పద్ధతి పాటించండి
* పోలింగ్ కేంద్రంలో పోటో గుర్తింపు కార్డును చూపించండి. * పోలింగ్ బూత్‌లోనికి మీరు మాత్రమే వెళ్లండి ఎవరిని వెంట తీసుకెళ్లకండి.
* ఎలాంటి ఒత్తిడులకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోండి.